క్లుప్తంగా

అధికారులతో కలెక్టర్ సమీక్ష



టెలీకాన్ఫిరెన్స్‌కు హాజరైన అధికారులు

వంగర: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం టెలీకాన్ఫిరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ టెలీకాన్ఫిరెన్స్‌లో పాల్గొని మండల స్థాయి అధికారులతో మాట్లాడారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లపై సమీక్షించి అవసరమైన మరమ్మతులు చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లను సన్మానించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లోపింటి త్రినాథ్, ఈఓపీఆర్‌డీ కెల్ల రామారావు, ఏపీఎం తెర్లి మంగమ్మ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు బెవర రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో వృద్ధి సాధించాలి



అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ ఆర్‌డీడీ రవీంద్ర

బొబ్బిలి: పన్నుల వసూళ్లలో వృద్ధి సాధించాలని మున్సిపల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ వి.రవీంద్ర సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మండల స్థాయి వివిధ శాఖల అధికారులతో శనివారం సమావేశమైన ఆయన.. పన్నుల వసూళ్లపై సమీక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పన్నులు సహా ఖాళీ స్థలాలు, కుళాయిలు, ఇంటి పన్నులను ఎప్పటికప్పుడు వసూలు చేయాలని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంఘాల ఆర్థిక లావాదేవీలు బాగుండాలి



మహిళా సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ చిరంజీవి

రేగిడి: స్వయంశక్తి సంఘాల ఆర్థిక లావాదేవీల్లో ఎటువంటి అవకతవకలు జరుగకుండా ఉండాలని వెలుగు ఏసీ చిరంజీవి సంఘాల మహిళలకు సూచించారు. మండలంలో పాత చెలికానివలస గ్రామంలో స్వయంశక్తి సంఘాల మహిళలతో శనివారం సమావేశం నిర్వహించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ప్రతీ నెల సక్రమంగా చెల్లించేలా చూడాలన్నారు. సంఘాల అధ్యక్షులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బ్యాంకుల్లో జమచేస్తున్న మొత్తాన్ని ప్రతీ నెల సమావేశంలో చర్చించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోవిందరావు, సీసీలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



గ్రోత్ సెంటర్‌లోని పరిశ్రమలను పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీను

బొబ్బిలిరూరల్/బొబ్బిలి: పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని తహసీల్దారు ఎం.శ్రీను సూచించారు. స్థానిక గ్రోత్ సెంటర్‌లోని బెర్రీ, విక్టోరియా తదితర పరిశ్రమలను ఆయన శనివారం సందర్శించి, అక్కడి భద్రతా చర్యలను పరిశీలించారు. కంపెనీలో పనిచేసే సిబ్బంది, యాజమాన్యంతో మాట్లాడి కార్మికుల రక్షణకు తీసుకుంటున్న చర్యలపై ఆరాతీశారు. పరిశ్రమల స్థాపన సమయంలో ఇచ్చిన ప్రాజెక్టు రిపోర్టు, భద్రతా చర్యల నిర్వహణ వివరాలను సోమవారం నాటికి అందజేయాలని తెలిపారు.

శరవేగంగా ఇంటింటి సర్వే



డీఆర్ఎన్‌వలసలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: మండలంలో డీఆర్ఎన్‌వలస, గడిముడిదాం తదితర గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి సర్వేను ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ప్రతీ ఇంట్లో మరుగుదొడ్లు వినియోగం ఉందా లేదా అనే అంశంపై సర్వే చేపడుతున్నట్లు చెప్పారు. సర్వే పక్కాగా నిర్వహించాలని, ఎటువంటి అలసత్వం వహించరాదని సిబ్బందికి సూచించారు.

అపరాల విత్తనాలేవీ?

- వ్యవసాయశాఖ ద్వారా అరకొరగా పంపిణీ
- ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేస్తున్న రైతులు
- అగమ్యంగా రైతు సేవా కేంద్రాల సేవలు



రేగిడి సమీపంలో పొలంలో అపరాల విత్తనాలు వేస్తున్న రైతు

రాజాం: గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎన్నో సేవలు అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుభరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. పేరుతో పాటు సేవల్లో కూడా మార్పు కనిపిస్తోంది. రైతులను ఈ కేంద్రాలు పట్టించుకునే పరిస్థితి కనిపించడంలేదు. కేంద్రాల్లో కియోస్క్ మిషన్లు ద్వారా ముందుగానే ఇండెంట్ పెట్టి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందించేవారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ కేంద్రాల్లో ఆ సేవలకు నీరసం వ్యాపించింది. రైతులకు సకాలంలో విత్తనాలు అందే పరిస్థితి కనిపించడంలేదు.

అపరాల విత్తనాల ఊసేలేదు

ఖరీఫ్ చివరి దశలో రైతులు తమ పొలాల్లో అపరాల విత్తనాలు జల్లుతారు. వరి తరువాత పంట మార్పిడి ద్వారా ఈ విత్తనాలు వేసి అపరాలు సాగుచేస్తారు. రబీలో పెసర, మినప, ఉలవ వంటి పంటలు సాగుచేయడం ద్వారా ఎటువంటి పెట్టుబడి లేకుండానే ఎకరాలో రూ.15 వేలు వరకూ ఆదాయం పొందే అవకాశం ఉంది. వరి కోతలకు ముందు పొలాల్లో కాలిబాటలు వేసి అపరాల విత్తనాలు జల్లుతారు. మెట్టు ప్రాంతాల్లో వరి కోతలు అనంతరం వేరుశనగ, రాగి, మొక్కజొన్న వంటి పంటలు సాగుచేస్తారు. ఈ విత్తనాలు వేసేందుకు ఇదే సరైన సమయం. గతేడాది రబీలో నియోజకవర్గంలో 9 వేల ఎకరాల్లో అపరాల పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది కూడా అదే స్థాయిలో అపరాల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. వీటితో పాటు మొక్కజొన్న, వేరుశనగ, రాగి, నువ్వు తదితర పంటల సాగుకు పొలాలను సిద్ధం చేశారు. గతేడాది మాదిరిగా ఈ ఏడాది నియోజకవర్గంలో అపరాల పంటల, రబీ సాగు పంటల విత్తనాలు పంపిణీ చేయలేదు. ఫలితంగా రైతులు ఇబ్బందులు పడ్డారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్లినా ఇండెంట్‌లు పెట్టలేదని సిబ్బంది చెప్పడంతో రైతులు ప్రైవేట్ షాపులు వద్ద విత్తనాలు కొనుగోలు చేశారు. నియోజకవర్గంలో మొత్తం 2వేల ఎకరాలకు సరిపడే అపరాల విత్తనాలు మాత్రమే వ్యవసాయశాఖ పంపిణీ చేసినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో రైతులే స్వచ్ఛందంగా విత్తనాలు తయారు చేసుకోవడంతో పాటు ఇతర ప్రాంతాల్లో కొనుగోలు చేసి పంటల సాగుకు సిద్ధమయ్యారు.

రైతులు ముందుకురాలేదు

గతేడాది మాదిరిగా ఈ ఏడాది రైతులు అపరాల విత్తనాల కొనుగోలుకు రైతు సేవా కేంద్రాలు వద్దకు అంతగా రాలేదు. దీంతో కొంతమేర మాత్రమే ఇండెంట్ పెట్టాం. వచ్చిన విత్తనాలను ప్రభుత్వ రాయితీ ప్రకారం రైతులకు పంపిణీ చేశాం. ఎక్కువగా రైతులు సొంతంగా విత్తనాల తయారీపై దృష్టి సారిస్తున్నారు.

– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఏడీఏ, రాజాం

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి



రామభద్రపురం: మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు



బొబ్బిలి రూరల్: శిక్షణార్థులకు సూచనలిస్తున్న ఎంపీపీ లక్ష్మి



బాడంగి: శిక్షణ కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

రామభద్రపురం: ప్రతిఒక్కరూ పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రత్నం అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు జీపీడీపీ(గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు) తయారీపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఉపయోగించి, ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, ఈవోపీఆర్‌డీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిరూరల్: పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ శంబంగి లక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జీపీడీపీ తయారీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆమె.. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్నారు. ముఖ్యంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాలని తెలిపారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం అభివృద్ధి పనుల్లో వెండర్ విధానాన్ని రద్దు చేసి, సర్పంచ్‌లకు ప్రాధాన్యమివ్వాలని జగన్నాథపురం, కారాడ గ్రామాల సర్పంచ్‌లు కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అరసాడ శంకరరావు, ఎంపీడీవో పి.రవికుమార్, ఈవోపీఆర్‌డీ భాస్కరరావు పాల్గొన్నారు.

బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు జీపీడీపీ తయారీపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఎంపీడీవో ఎస్.రామకృష్ణ హాజరై, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన అంశాలను ఇక్కడ నేర్చుకుని, వాటిని అనుసరించి, ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. సమష్టి కృషితోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో లత తదితరులు పాల్గొన్నారు.

12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దారు సులోచనరాణి

రామభద్రపురం: మండలంలో ఈ నెల 21వ తేదీ నుంచి ధాన్యం సేకరణ ప్రారంభిస్తామని తహసీల్దారు సులోచనరాణి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ధాన్యం సేకరణకు సంబంధించి, వీఆర్వోలతో శనివారం సమావేశమైన ఆమె.. మండలంలో 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ధాన్యం సేకరణకు బూసాయవలసలో రెండు, ఆరికతోటలో ఒకటి, కొట్టక్కిలో ఒక ధాన్యంమిల్లుకు ఎఫ్‌సీఐ(ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) నుంచి అనుమతులు లభించించాయన్నారు. ఒక్కో మిల్లుకు రూ.30 వేలు చొప్పున గన్నీ సంచులు ఇస్తున్నామన్నారు. మిల్లర్లు కూడా త్వరలో బ్యాంకు గ్యారంటీలు ఇస్తారన్నారు. రైతులు తొందరపడొద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయాలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బొబ్బిలి: ప్రతిఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక రాజా కాలేజీలోని విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం యువత, విద్యార్థులు ఫ్యాషన్ మాయలో పడి గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా వంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి అలవాట్లు అలవర్చుకుని, ఉత్తమ జీవనాన్ని కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ చల్లా వీరేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

రాజాం/సంతకవిటి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ డోల శ్రీదేవి ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమకారులు ఎస్.ఆర్.రంగనాథన్, అయ్యంకి వెంకటరమణయ్య, పోతూరి నాగభూషణ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి సేవలను స్మరించుకున్నారు. రాజాం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు గ్రంథాలయ అధికారి వై.అమర్‌నాథ్, శంకరరావు, పాఠకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలి



మృతదేహం నుంచి కార్నియా సేకరిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

రాజాం సిటీ: ఎంతో మంది అంధులకు చూపును ప్రసాదించే నేత్రదానం కుటుంబ సాంప్రదాయం కావాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయి ప్రశాంత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని లచ్చయ్యపేటకు చెందిన అల్లాడ సత్యారావు (50) శనివారం మృతిచెందారు. ఆయన నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. వెంటనే శ్రీకాకుళం రెడ్‌క్రాస్ నేత్రసేకరణ కేంద్రానికి సమాచారం అందించడంతో వారు వచ్చి మృతుని నుంచి కార్నియా సేకరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సభ్యులు నేత్రదానంపై అక్కడున్న వారికి అవగాహన కల్పించారు. జిల్లాలో ఇప్పటి వరకు 500 మంది నుంచి నేత్రాలు సేకరించి 980 మందికి చూపును ప్రసాదించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, బింగి రంగనాథం, టెక్నీషియన్లు సుజాత, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శివకృష్ణ

రాజాం సిటీ: విద్యార్థులు చిన్నప్పటి నుంచే విలువలు తెలుసుకుని మసలుకోవాలని మోటివేషనల్ స్పీకర్ బూరాడ శివకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ రోడ్డు పాఠశాలలో విద్యార్థులకు మంచి–చెడులపై శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడు మంచి విషయాలు తెలుసుకోవడం ద్వారా సద్గుణాలు అలవడతాయని పేర్కొన్నారు. చెడు స్నేహాలు, చెడు అలవాట్లు, చెడు ఆలోచనలు మనిషి జీవితాన్ని అధోగతి పట్టిస్తాయన్నారు. దైవ చింతనతోనే సన్మార్గం అలవడుతుందని, ప్రతి ఒక్కరూ దైవనామాన్ని స్మరించాలన్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం



చింతామణి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలో జాతీయ పత్రికా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, డీఎస్పీ పి.శ్రీనివాసరావులు స్థానికంగా ఉన్న చింతామణి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. పాత్రికేయ రంగంలో విశిష్టమైన సేవలందించిన చింతామణి విదేశాల్లో సైతం ఖ్యాతి గడించారని కొనియాడారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్‌కుమార్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కందుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీపురం పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ పోటీలు

రేగిడి: మండలంలో లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి సాంఘికశాస్త్ర పోటీలు నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన 130 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. లక్ష్మీపురం పాఠశాలకు చెందిన కెంబూరి జ్యోతి ప్రథమ స్థానం, రేగిడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పి.సాయిశ్రీ ద్వితీయ స్థానం, రేగిడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎల్.గౌతమి, ఏవీపురం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎం.తేజేశ్వరరావు సంయుక్తంగా తృతీయ స్థానంలో నిలిచారు. ఖండ్యాం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పి.సోమశంకర్, అంబఖండి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన వై.రమ్య కన్సోలేషన్ బహుమతి సాధించారు. విజేతలకు ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు హెచ్ఎం కృష్ణారావు తెలిపారు.

చిన్నారులకు ఆరోగ్య తనిఖీలు

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రతినెలా ఆరోగ్య తనిఖీలు నిర్వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రెడ్డి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్త వై.శ్రీదేవి ఆధ్వర్యంలో చిన్నారులకు శనివారం ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. తెర్లాం సచివాలయం ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి చిన్నారులకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేసి, పలు సూచనలు చేశారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని, కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయోద్యమకారుల త్యాగాలు మరువలేనివి



తెర్లాం: గ్రంథాలయోద్యకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పిస్తున్న దృశ్యం

తెర్లాం: గ్రంథాలయ వ్యవస్థ ఏర్పడడానికి గ్రంథాలయోద్యమకారులు చేసిన త్యాగం మరువలేనిదని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి కొనియాడారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ నాయకులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, రామలక్ష్మణమూర్తి, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి, శనివారం నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను స్మరించుకున్నారు. ఎంతోమంది మహానుభావుల త్యాగఫలితం కారణంగానే గ్రంథాలయాలు రూపుదిద్దుకున్నాయని, గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాడంగి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథ్, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, జయంతి రామలక్ష్మణమూర్తిల చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారు గ్రంథాలయాల స్థాపనకు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు, పాఠకులు గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళులర్పించారు.

పరామర్శ



సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే శంబంగి, తదితరులు



సత్యంను పరామర్శిస్తున్న డాక్టర్ తలే రాజేష్, తదితరులు

తెర్లాం: మండలంలోని ఉద్దవోలు గ్రామ సర్పంచ్ ఎచ్చెర్ల సునీత కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు పరామర్శించారు. సర్పంచ్ భర్త, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు విజయప్రసాద్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న సదరు నేతలు శనివారం ఆ గ్రామంలోని సర్పంచ్ ఇంటికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. విజయప్రసాద్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, సంతాపం ప్రకటించారు. ఏ అవసరం వచ్చినా ఆదుకుంటామని, అధైర్యపడొద్దని జెడ్పీ చైర్మన్ ధైర్యం చెప్పారు. వారి వెంట ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షులు పెదబాబు, పార్టీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు తదితరులు ఉన్నారు.

రాజాం: మండలంలో లక్ష్మీపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గేదెల సత్యంను పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ శనివారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యం కారణంగా సత్యం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న అనంతరం ఇంటికి వచ్చారు. విషయం తెలుసుకున్న రాజేష్ గ్రామానికి చేరుకుని ఆయన్ను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వాకముల్ల చిన్నంనాయుడు, డాక్టర్ నరేంద్ర, నందబలగ పంచాయతీ సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ బింగి సూర్యనారాయణ, తాడ్డి గోపాలకృష్ణ, సూరిబాబు, గొలివి రామకృష్ణ, బింగి రామమ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతే దైవసన్నిధికి వారధి

రేగిడి: ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని పాలకొండకు చెందిన ఆధ్యాత్మిక వక్త ఎస్వీ రమణ అన్నారు. మండలంలో దేవుదళ గీతాశ్రమంలో శనివారం ఆధ్యాత్మిక గురువు గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్య మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. మనిషిలో అహం అనేది రాక్షసత్వంకు నిదర్శనమని, సేవాభావం, రాజీపడడం అనేవి దైవగుణాలని వెల్లడించారు. ప్రతీ ఒక్కరితో ఆప్యాయంగా మాట్లాడడం, సేవాభావాన్ని పంచుకోవడం, సత్ప్రవర్తనతో మెలగడం వంటివి పాటించాలన్నారు. ఆధ్యాత్మికతే దైవసన్నిధికి వారధి అని అన్నారు. కార్యక్రమంలో దేవుదళతో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

'సంకల్పం'పై అవగాహన



కాగితాపల్లిలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రేగిడి: మండలంలో కాగితాపల్లి గ్రామంలో 'సంకల్పం' కార్యక్రమంపై రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర, ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎస్.శంకర్ శనివారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని అలవాటుచేసుకోవాలని సూచించారు. వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని కోరారు.

విద్యార్థుల్లో పోటీతత్వం అవసరం



విజేతలతో వికాస తరంగిణి సభ్యులు

రాజాం సిటీ: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీతత్వం అవసరమని వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే పోటీతత్వంతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని అన్నారు. ఇటీవల వికాస తరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామాయణంపై చిత్రలేఖనం పోటీల విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షులు వి.పైడిరాజు, డి.త్రినాథులు, కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, సన్ స్కూల్ ప్రిన్సిపాల్ భారతి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యజీవన సత్సంగం రేపు

సంతకవిటి: మండలంలోని సిరిపురంలో వెలసిన కొంగకామేశ్వర ఆలయ ప్రాంగణంలో కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా దివ్యజీవన సత్సంగం నిర్వహించనున్నట్లు ప్రకాశానంద స్వామి తెలిపారు. ఈ సత్సంగంలో ఒడిశాలోని గోపాలపురానికి చెందిన గురు వరనానందస్వామి, అల్యానా వినయ్‌కుమార్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తారని అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అనంతరం మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

శిస్తు వసూళ్లపై శిక్షణ

రేగిడి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో భూమి శిస్తు వసూళ్లపై వీఆర్వోలకు శనివారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నారావు కొత్త మాడ్యూల్ ఫసలీలు వారీగా నమోదు చేయాల్సిన వివరాలపై అవగాహన కల్పించారు. గ్రామాలు వారీగా ఆన్‌లైన్‌లో వివరాలు నమోదుచేయాలని, భూమి శిస్తు వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు.

బర్త్ సర్టిఫికెట్ల జారీ వేగవంతం

వంగర: పాఠశాల విద్యార్థులకు బర్త్ సర్టిఫికేట్లు జారీ వేగవంతం చేస్తున్నట్లు తహసీల్దార్ దిరిశాల ధర్మరాజు తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు 300 బర్త్ సర్టిఫికేట్లు జారీచేశామని, గ్రామ స్థాయి నుంచి ధ్రువీకరణ పత్రాలు కోసం అర్జీలొస్తే సకాలంలో వాటిని ఆర్డీవో కార్యాలయానికి ఆన్‌లైన్ ద్వారా పంపిస్తామని, సకాలంలో సర్టిఫికేట్లు మంజూరు చేస్తామన్నారు.

నేడు మండల సమావేశం

వంగర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లోపింటి త్రినాథ్ తెలిపారు. ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అధ్యక్షతన జరగే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సంగాంలో రుద్రాభిషేకం



రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు

వంగర: మండలంలోని సంగాంలో వెలసిన సంగమేశ్వరస్వామి సన్నిధిలో శనివారం భక్తులు రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సిద్ధాంతం గణపతి ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు.

19న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం

బాడంగి: కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 19వ తేదీన ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామైక్య సంఘాల వీవోఏలు, కార్యదర్శులతో శనివారం సమావేశమైన ఆయన.. మరుగుదొడ్ల ప్రయోజనాలు, బహిరంగ మల, మూత్ర విసర్జన నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఆరుబయట మల, మూత్ర విసర్జన ద్వారానే వ్యాధులు ప్రబలుతున్నాయని, దీనిపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 19 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీఎం రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

రాజాం సిటీ: విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో బీఎస్పీ ఆధ్వర్యంలో డిసెంబర్ 1న చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ధర్నాకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బొత్స బుద్దుడు, జె.నీలయ్య, వి.పాపారావు, జి.రవికుమార్, ఎస్.అనీల్ పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు టీకాలు దోహదం

రాజాం సిటీ: చిన్నారులు, గర్భిణులు వ్యాధుల బారిన పడకుండా వ్యాధి నిరోధక టీకాలు దోహదపడతాయని యూపీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని మల్లికార్జున కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. గర్భిణులు, చిన్నారులు సకాలంలో టీకాలు వేయించుకుంటే ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమ, అంగన్‌వాడీ కార్యకర్త ఎం.శ్రీదేవి, ఆశ కార్యకర్త ఇందిర, ఆయా రమణమ్మ పాల్గొన్నారు.